క్లుప్తంగా

రథం షెడ్‌కు శంకుస్థాపన



రథం షెడ్‌కు శంకుస్థాపన చేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంలో గొంచాల అగ్రస్థానంలో ఉన్నదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం ఆ గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న రథం షెడ్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ గ్రామం నుంచి ఏటా భక్తులు కాలి నడకన భద్రాచలం వెళ్తారు. గత ఏడాది భక్తుల నుంచి వచ్చిన విరాళాలతో భద్రచలం సీతారాములను తీసుకు వెళ్లడానికి చేయించిన టేకు చెక్క రథాన్ని భద్రపరచడానికి పంచాయతీ స్థలం కేటాయించడంతో టీడీడీ నుంచి మంజూరైన నిధులతో ఈ షెడ్ నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పేర్నిడి వెంకట్రాయుడు, గ్రామ నాయకులు చోడిశెట్టి చినజోగారావు, కర్రి బుజ్జి, అముజాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే చర్యలు తప్పవు



పెద్దాపురంలో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ ఎస్ఐ, సిబ్బంది

పెద్దాపురం: పట్టణంలో పర్యావరణానికి హాని కల్గించే ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు హెచ్చరించారు. పట్టణంలోని పలు వ్యాపార దుకాణాల్లో గురువారం ఆయన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దావీదురాజు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వ్యాపారులపై నిర్వహించిన దాడుల్లో 15 కేజీల ప్లాసిక్ సంచులను స్వాధీనం చేసుకుని సుమారు రూ.15 వేల అపరాధ రుసుము విధించినట్లు దావీదురాజు తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న నాగేశ్వరరావు దంపతులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఓదూరి నాగేశ్వరరావు వీరలక్ష్మి దంపతులు కార్తికమాసాన్ని పురష్కరించుకుని గురువారం చేబ్రోలులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు 600 మందికి అన్నదానం చేసి దుప్పట్లు అందజేసినట్టు ఆయన తెలిపారు. 2011లో ఇద్దరితో ప్రారంభించిన ఆ కార్యక్రమంలో ఏటా పెంచుతూ ఇప్పుడు ఎక్కువ మందికి పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓదూరి కిషోర్, బుద్దాల శ్రీనివాస్, దిబ్బిడి సురేష్, అల్లం దుర్గ, మెట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పరిశీలన



ట్యాబ్‌ను పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పీఏఎల్ టాయబ్‌ను కాకినాడ జిల్లా సమగ్ర శిక్షా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎంఎస్ సుబ్రహ్మణ్యం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు పీఏఎల్ ట్యాబ్‌ల ద్వారా గణితం సులభంగా నేర్చుకోగలుగుతారని ఆయన అన్నారు. ఈ ల్యాబ్‌లను ప్రతి విద్యార్థి వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రతీ వారానికి 60 నిమిషాల పాటు ట్యాబ్‌ను వినియోగించుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. చేబ్రోలు ఉన్నత పాఠశాలకు 30 ట్యాబ్‌లు మంజూరయినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీఎస్ ప్రకాష్, వీరాస్వామి, మూర్తి, ఎం.పద్మజ, ఉమాదేవి తదిరులు పాల్గొన్నారు.

మహావిష్ణు అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు గురువారం సీతారామస్వామి మహావిష్ణు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రబీకి లిఫ్ట్ ఇచ్చారు



కాపవరం ఎత్తిపోతల పథకం



పీబీ దేవం ఎత్తిపోతల పథకం

- డెల్టా కంటే ముందుగా వరినాట్లు
- వంతుల వారీగా సాగునీటికి అనుమతి
- హర్షం వ్యక్తం చేస్తున్న నిర్వాహకులు

సామర్లకోట: ఎత్తిపోతల పథకాల కింద సాగు భూములకు కేవలం ఖరీఫ్‌కు మాత్రమే అనుమతి ఉంది. అయితే మహానేత రాజశేఖరరెడ్డి వచ్చిన తరువాత రబీకి కూడా ప్రాధాన్యమివ్వడంతో ప్రస్తుత సీఎం జగన్ సైతం ఈ సాగుకు నీరు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుత తీవ్ర వర్షాభావ పరిస్థితులోనూ ఆయా పథకాలకు సాగునీరు ఇవ్వడానికి బుధవారం జరిగిన సమావేశంలో అధికారులు అనుమతి ఇవ్వడంతో వాటి నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డెల్టా ప్రాంతాల కంటే ముందుగా ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో వరినాట్లు పూర్తవుతాయి. ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు 60 కిలోమీటర్ల పొడవున ఉన్న కాలువను సామర్లకోట గోదావరి కాలువగా పిలుస్తారు. దీనిపై జి.మేడపాడు ఎత్తిపోతల పథకం పరిధిలో 1,050 ఎకరాలు, వేట్లపాలెం ఎత్తిపోతల పథకం పరిధిలో 1,700 ఎకరాలు, పెదబ్రహ్మదేవం ఎత్తిపోతల పథకం పరిధిలో వెయ్యి ఎకరాలు, ఇళ్లపల్లి ఎత్తిపోతల పథకం కింద 750, కాపవరం ఎత్తిపోతల పథకం కింద 600 ఎకరాలు సాగు అవుతుంది.

వైఎస్సార్ చలువతో ఎత్తిపోతల పథకాలకు గుర్తింపు

ఎత్తిపోతల పథకాల నిర్వహణ కష్టంగా ఉన్న తరుణంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆ పథకాలకు జీవం పోశారు. వాటికి 16 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా రబీకి అనుమతి లేకున్నా వంతుల వారీగా సాగునీరు ఇచ్చేవారు. ప్రస్తుతం నీటి ఎద్దడి ఎక్కువగా ఉండటంతో ఎత్తిపోతల పథకాలపై దృష్టి సారించి రబీకి నీరు ఇవ్వాలని కలెక్టర్ కృతికా శుక్లా ఇరిగేషన్, ట్రాన్స్‌కో, వ్యవసాయాధికారులకు సూచించారు. ఈ మేరకు అధికారులు వంతుల వారీగా నీటిని వినియోగించుకోవాలని సూచించడంతో మెట్ట ప్రాంతాల్లో పంట భూములకు నీటి సమస్య తీరనుంది.

పథకాలతో రైతులకు మేలు



గోదావరి కాలువ అందుబాటులో ఉన్నా సాగునీరు అందని పరిస్థితుల్లో ఎత్తి పోతల పథకాలు రావడంతో రైతులకు మేలు చేకూరుతోంది. దీనికి తోడు ఉచిత విద్యుత్‌తో నిర్వహణ భారం కొంత మేర తగ్గింది. ఎత్తిపోతల పథకాల పరిధిలో రైతుల నుంచి నీటితీరువా వసూలు చేసుకునే అవకాశం ఇవ్వడంతో ఆ నిధుల నుంచి పథకాలు నిర్వహిస్తున్నారు. రబీకి ఏటా వంతుల వారీగా వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం నీటి ఎద్దడి దృష్ట్యా పొదుపుగా వాడుకోవాల్సి ఉంది. – తోటకూర శ్రీనివాస ప్రకాశరావు, ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు, పీబీ దేవం

వచ్చేనెల 5 నాటికి రబీ నాట్లు పూర్తికావాలి



ఖరీఫ్ కోతలు పూర్తిచేసుకున్న రైతులు వెదజల్లు, నాట్లు వేసే పద్ధతుల్లో సాగు ప్రారంభించాలి. 120 రోజులకు పంట వచ్చే రకాల నాట్లను డిసెంబరు 5 నాటికి పూర్తి చేసుకోవాలి. మార్చి 31 నాటికి గోదావరి కాలువ మూసి వేసే అవకాశం ఉంది. బొండాలకు సమయం ఎక్కువ పడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎంటీయూ 1121, ఎంటీయూ 1153 రకాలు వేసుకోవాలి. – జీవీ పద్మశ్రీ, వ్యవసాయశాఖ ఏడీఏ, కాకినాడ

ఘనంగా ఏకాహం



గోరింటలో ఏకాహ మహోత్సవంలో భజన చేస్తున్న సంఘం

పెద్దాపురం: కార్తిక ఏకాదశిని పురస్కరించుకుని గురువారం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఏకాహ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామున నాలుగు గంటల నుంచి ఆయా గ్రామ, వీధుల్లోని దేవాలయాలు, రామాలయాల్లో భజనలు చేశారు. మండలంలోని గోరింట శ్రీ రామ బాల భక్త సమాజం అధ్యక్షులు పచ్చిపాల ప్రసాదరావు ఆధ్వర్యంలో భజన సంకీర్తనలు, ఏకాహ భజన పోటీలు నిర్వహించారు.

సప్తాహాలు ప్రారంభం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ ఉమా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో 25వ సప్తాహ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత గ్రామస్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. 56 భజన సమాజాలతో వారం రోజుల పాటు సప్తాహం నిర్వహించున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- ఎమ్మెల్యే ఆర్థిక సాయంతో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: యువతకు ఉపాధి ఉద్యోగావకాశాల కల్పనే ధ్యేయంగా పలు కార్యక్రమాలు చేపట్టినట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాయలం వద్ద నిర్వహించిన నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షల శిక్షణా కార్యక్రమంలో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పిఠాపురంలో నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. డీఎస్సీ, ఆర్ఆర్‌బీ, గ్రూపు- 1, 2 ఎస్సై, కానిస్టేబుల్, సచివాలయ ఉద్యోగాలు, ఎస్ఎస్‌సీ వంటి అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో వారి భవితకు బాట వేయాలని సంకల్పించామన్నారు. ఒక్కో పరీక్షా శిక్షణకు ఒక్కో అభ్యర్థికి రూ.30 వేల వరకు వరకు ఖర్చు అయ్యే పరిస్థితి ఉండగా తాను మొత్తం ఆర్థిక సహాయం చేస్తూ అందరికీ శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేశామన్నారు. మూడు నెలల పాటు పిఠాపురంలో ఒక ప్రైవేటు కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 150 మంది పేర్లు నమోదు చేయించుకున్నారని, రెండు రోజుల్లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాకులు పాల్గొని అభ్యర్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. పలువురు అభ్యర్థులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

- క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో పరిశ్రమల ప్రతినిధులు
- వివిధ క్రీడాంశాల్లో ఉత్సాహంగా పాల్గొన్న కార్మికులు



పరిశ్రమల స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఆయా సంస్థల ప్రతినిధులు

సామర్లకోట: పరిశ్రమల మధ్య స్నేహ భావాన్ని పెంపొందించుకొవడానికి ఆటల పోటీలు ఏర్పాటు చేసినట్లు వివిధ పరిశ్రమల యజమానులు తెలిపారు. జిల్లా పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట మండలాల పరిధిలో ఉన్న ఉద్యోగులకు, కార్మికులకు వివిధ ఆటల పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలను పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయాగా గురువారం నుంచి కళాశాల ఆవరణలో నిర్వహించుకొవడానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వీరయ్య చౌదరి అనుమతించారు. నియోజకవర్గ పరిధిలో పెద్ద పరిశ్రమలైన రాక్ సిరామిక్స్, అపర్ణ సిరామిక్స్, రిలయన్స్ పవర్ ప్లాంటు, గిరిజా పవర్ ప్లాంటు, దేవి సీఫుడ్స్, నెక్కంటి ఫుడ్స్‌కు చెందిన పరిశ్రమ ఉద్యోగులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఆయా పరిశ్రమల ప్రతినిధులు పోటీలను ప్రారంభించారు. ఉద్యోగులు, కార్మికులలో ఉన్న ఒత్తిడి క్రీడల వల్ల తొలగిపోయే అవకాశం ఉంటుందన్నారు. క్రికెట్, వాలీబాల్, షటిల్ పోటీలను నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ప్రారంభ ఆటల పోటీల్లో రాక్ సిరామిక్స్ ప్రతినిధులు టి.నీరజ్ కుమార్, పి.బాలాజీ, వీజీఎస్ కుమార్, ఆదర్శ్, అపర్ణ నుంచి మధుసూదన్, సత్యనారాయణ, రిలయన్స్ పవర్ నుంచి ప్రకాష్, దేవి సీఫుడ్స్ నుంచి రవీంద్రనాథ్, అనిల్, గిరిజ పవర్ నుంచి రవి, నెక్కంటి సీఫుడ్స్ నుంచి గోపీచంద్, సురేంద్ర పాల్గొన్నారు.

సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రం కుక్కుటేశ్వర స్వామివారి ఆలయ అధికారుల ఆధ్వర్యంలో సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలు గురువారం ప్రారంభించారు. దీనిలో భాగంగా పిఠాపురం మండలం విరవ రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా పలు గ్రామాల్లో వారం రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. సనాత ధర్మం విలువను ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో ఉండాలి



మూలపేటలో సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంచుకోవాలని గ్రామ సర్పంచ్ కంబాల మౌనిక అన్నారు. మూలపేటలో శ్రీదేవి, భూదేవి సమేత జగన్నాథస్వామి, శ్రీ సత్యనారాయణస్వామి దేవస్థానంలో గురువారం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని పాలక మండలం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారిని దర్శిదంచుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పురాతన దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పూరి జగన్నాథ స్వామి ఆలయ విగ్రహ ప్రతిమలను పోలి ఉండే ఈ విగ్రహాలు 204 సంవత్సరాల క్రితం సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు లభించడం ఈ గ్రామం చేసుకున్న అదృష్టమన్నారు. సత్యనారాయణమూర్తి విగ్రహం కూడా బావిలో లభించినట్టు స్థానిక పెద్దలు తెలియజేశారన్నారు. ఆలయంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమం చేపట్టిన ఆలయ కమిటీ, గ్రామ పెద్దలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అడ్డా పాప, అడ్డా తిమూర్తులు, మడుగుల ఈశ్వరరావు, మలిపెద్ది రామరావు, మలిపెద్ది సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బాలల సైన్స్ కాంగ్రెస్‌కు శ్రీప్రకాష్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న విజయ్ ప్రకాష్

పెద్దాపురం: ఈ నెల 29వ తేదీన గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ప్రత్యూష ప్రధాన, సంజన్ కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్‌లోని సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్నారన్నారు. అక్కడ ఎంపిక చేసిన సైన్స్ కాంగ్రెస్ పోటీలకు వీరు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను విజయ్‌ప్రకాష్, జాయింట్ సెక్రటరీ సమీరా, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, టీటీ కోచ్‌లు వేణుగోపాల్, శ్రీరామ్, అకడమిక్, కల్చరల్ కో-ఆర్డినేటర్లు అభినందించారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ పెరిగింది. కార్తిక ఏకాదశి కావడంతో తెల్లవారు జాము నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారికి, కుమారస్వామికి, బాలాత్రిపుర సుందరి దేవికి పూజలు చేశారు. తెల్లవారు జాము, రాత్రి ఆలయంలో భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. రావి, ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

అదనపు నిధులు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే దొరబాబుకు సర్పంచుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

పిఠాపురం: గ్రామ పంచాయతీలకు అదనపు నిధులు ఇప్పించి, వాటి అభివృద్ధికి కృషి చేయాలని పిఠాపురం మండల సర్పంచులు గురువారం ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ సర్పంచుల మండల సమాఖ్య అధ్యక్షుడు నడిగట్ల చింతలరావు ఆధ్వర్యంలో సర్పంచులు పిఠాపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి గ్రామాల్లో అభివృద్ధి పనులను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధచూపిస్తున్నారన్నారు. సర్పంచుల కోరిక మేరకు తప్పకుండా విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం మండల సర్పంచులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు పరిష్కరించండి

కలెక్టర్ కృతికా శుక్లా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 రూపకల్పనలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలను గడువులోపు పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్ఎస్ఆర్–2024 కార్యకలాపాలపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, నియోజకవర్గం హెడ్ క్వార్టర్ తహసీల్దార్లతో కలెక్టర్ కృతికా శుక్లా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎం స్టోరేజ్ పాయింట్ల గుర్తింపు, డెమోగ్రఫికల్ సిమిలరీ ఎంట్రీస్, ఫారం 6, 7, 8ల పరిష్కారం డోర్ నంబర్, క్లెయిముల పరిష్కారాలు, 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా చేర్చడం వంటి అంశాలపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎస్ఎస్ఆర్–2024 రూపకల్పనలో భాగంగా అధికారులు ఎన్నికల అంశాలకు ప్రాధాన్యమిచ్చి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను గడువులోగా పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న దరఖాస్తులను రానున్న వారం రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్‌రెడ్డి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఈట్ల కిషోర్, జె.సీ తారామారావు, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, వివిధ నియోజకర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. కార్తిక మాసం శివాలయాలలో దీపాలు వెలిగిస్తే మంచి ఫలితాలు లభిస్తాయని భక్తులు నమ్మకం. ఈ మేరకు పంచారామ క్షేత్రంలో ప్రతి రోజు కార్తిక దీపాలు వెలిగిస్తారు. ఆలయంలో పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాసు దంపతులు లక్షపత్రి పూజలు చేశారు. వారి కోసం ప్రత్యేకంగా దీపారాధన సంఘ భక్తులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు. దానిలో దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీ పడ్డారు. లక్షపత్రి పూజలు చేసుకున్న వారు దీపాలు వెలిగించిన తరువాత మిగిలిన దీపాలను భక్తులు వెలిగించారు.

28న మధ్వ కార్తిక సమారాధన

బోట్‌క్లబ్: మధ్వపురోహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో ఈ నెల 28న కార్తిక వన సమారాధన స్థానిక గొడారిగుంటలోని రమా సహిత సత్యదేవ మందిరంలో నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వాహకులు పరశురామ్ గురవారం తెలిపారు. కార్తిక సమారాధనలో ఉదయం 6 గంటలు నుంచి అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, అనంతరం కార్తీకమాస విశేషాలను ప్రవచన రూపంలో చెప్పడం జరుగుతుందన్నారు. భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

పెద్దాపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



పెద్దాపురంలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న చైర్మన్ తులసీ మంగతాయారు

పెద్దాపురం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా ఆయననే గెలిపించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి అన్నారు. పట్టణంలోని 9వ సచివాలయ పరిధిలోను, మండలంలోని కొండపల్లి గ్రామాల్లో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఒక్కరూ గుర్తించి రెండో దఫా వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. రెండో సారి గెలిపిస్తే ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. కొండపల్లి గ్రామంలో సర్పంచ్ కొత్త చక్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందున్నారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమం, అభివద్ధి బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, తలారి ధర్మేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు, కొండపల్లి ఎంపీటీసీ పోకనాటి నాగలక్ష్మి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ



సామర్లకోట అయోధ్యరామపురంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన చైర్‌పర్సన్ తదితరులు

సామర్లకోట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు మరింత చేరువ చేయడానికి 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. శుక్రవారం స్థానిక అయోధ్యరామపురం తాండ్ర పాపారాయుడు విగ్రహం వద్ద ఆమె ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారుల జాబితా బోర్డును ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుకున్న వారి అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు తెలిపారు. పథకాలు అందని వారికి వలంటీర్లు వారం రోజుల్లో రోజుకు 10 మంది చొప్పున ఈకేవైసీ చేసి దరఖాస్తు చేయించి పథకాలు అందిస్తారన్నారు. పిల్లల చదువుకు, ఆరోగ్యానికి సీఎం జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారని అటువంటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక నాయకుడు దవులూరి దొరబాబును గెలిపించుకోవాలన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు గుబ్బల సత్యనారాయణ, స్వయంభారపు వీరభద్రరావు, సేపెని సురేష్, నక్కా శ్రీనివాస్ జేసీపీ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, పార్టీ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, వేగి సత్యనారాయణ, పాలిక చంటిబాబు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను చైర్‌పర్సన్ ఎగురవేశారు.